సాక్షి అనకాపల్లి

గురువారం । 18 । మే । 2023




ఏయూ ప్రగతి ప్రశంసనీయం

విశాఖ: ఏయూలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఉన్నత విద్యా శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్యామలరావు ప్రశంసించారు.



రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయం

విశాఖ: ఆపద వేళ రెడ్‌క్రాస్ సొసైటీ అందిస్తున్న సేవలను కలెక్టర్ ఎ.మల్లికార్జున కొనియాడారు. రక్తదాతలను సన్మానించారు.



జూలో మరణ మృదంగం

విశాఖ జూలో రెండు నెలల్లో మూడు జంతువులు మృతి చెందాయి. ఒక్కొక్కటిగా సందర్శకులకు దూరమవుతున్నాయి. 8లో

న్యూస్‌రీల్

మోదకొండమ్మ పండగ గోడ పత్రిక ఆవిష్కరణ



గోడ పత్రికను విడుదల చేస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

మాడుగుల: మోదకొండమ్మ పండగ వచ్చే నెల 6వ తేదీన ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిలో భాగంగా పండగ గోడ పత్రికను ఖండివరం గ్రామంలో బుధవారం డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆవిష్కరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పుప్పాల అప్పలరాజు, కమిటీ సభ్యులు శ్రీనాధు శ్రీనివాసరావు, మాడుగుల గ్రామ సర్పంచ్ ఎడ్ల కళావతి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

20న ఏపీఆర్ఎస్ క్యాట్, ఏపీఆర్‌జేసీ, డీసీ పరీక్షలు

తుమ్మపాల : ఈ నెల 20న జరగబోయే ఏపీఆర్ఎస్ క్యాట్–2023, ఏపీఆర్‌జేసీ, డీసీ–2023 పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టికెట్లను సంబంధిత వెబ్‌సైట్ల నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాల్సిందిగా జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 5, 6, 7, 8 తరగతులకు సంబంధించి http://aprs.apcfss.in/StudentLogin.do వెబ్‌సైట్ నుంచి ఇంటర్, డిగ్రీకి సంబంధించిన హాల్ టికెట్లను http://aprs.apcfss.in/APRJCinterStudentLogin.do వెబ్‌సైట్ నుంచి విద్యార్థి ఐడీ, పుట్టిన తేదీ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. హాల్‌టికెట్‌కు సంబంధించి సందేహాలుంటే హెల్ప్ లైన్ నంబర్ 98665 59617 ను సంప్రదించాలన్నారు. పరీక్షలు జరిగే రోజున విద్యార్థులు పరీక్షా కేంద్రానికి కనీసం 30 నిముషాలు ముందుగా చేరుకోవాలని సూచించారు.

12 మంది నర్సులకు పదోన్నతులు

మహారాణిపేట: వైద్య ఆరోగ్యశాఖలో 12 నర్సులకు హెడ్ నర్సులుగా పదోన్నతలు కల్పించారు. బుధవారం రీజినల్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.ఉమా సుందరి పదోన్నతలు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ 12 మందికి ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల్లో పలు ఆస్పత్రుల్లో నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

క్వారీని పరిశీలించిన మైనింగ్ ఇన్‌స్పెక్టర్

అనకాపల్లిటౌన్ : మండలంలోని రొంగలివానిపాలెం క్వారీకి అనుమతులివ్వొద్దంటూ సోమవారం స్పందనలో వచ్చిన ఫిర్యాదుపై కలెక్టర్ ఆదేశాల మేరకు మైనింగ్ ఇన్‌స్పెక్టర్ స్వాతి బుధవారం క్వారీని పరిశీలించారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు క్వారీలో ఎలాంటి కార్యకలాపాలు చేయొద్దంటూ, యాజమాన్యానికి నోటీసులందించారు. క్వారీలో జరుగుతున్న పనులను నిలిపివేసి, ఎవరూ ప్రవేశించికుండా ట్రెంచ్(కందకం) ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మైనింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ మోసం

- యాప్ ఇన్‌స్టాల్ పేరిట రూ.లక్షా 40 వేలు మాయం

మునగపాక: యాప్ ఇన్‌స్టాల్ చేసుకున్న మహిళ ఖాతా నుంచి రూ.లక్షా 40 వేల మేర నగదు విత్‌డ్రా కావడంతో మునగపాక పోలీసులకు ఫిర్యాదు అందింది. ఎస్ఐ మహమ్మద్ అలీ తెలిపిన వివరాలు.. మండలంలోని తిమ్మరాజుపేటకు చెందిన భీమిశెట్టి శ్రీవిద్య తన భర్త పేరిట ఉన్న గ్యాస్ నంబర్ మార్పు కోసం కస్టమర్ కేర్‌ను ఆశ్రయించారు. కస్టమర్ కేర్ నుంచి మాట్లాడిన వ్యక్తి శ్రీవిద్యకు రెండు యాప్‌లు పంపి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఆమె రెండు యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకొని ఇన్‌స్టాల్ చేసుకున్నారు. ఇన్‌స్టాల్ చేసుకున్న కొంత సమయానికి ఆమె ఖాతాలో ఉన్న రూ.లక్షా 40 వేల నగదు మాయమైంది. తాను మోసపోయినట్లు గుర్తించి ఆమె మునగపాక పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసిన పోలీసులు సైబర్ పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అలీ తెలిపారు.

రంగురాళ్లతో ఇద్దరు తమిళనాడు వ్యక్తుల అరెస్టు

నర్సీపట్నం: రంగురాళ్లు కలిగి ఉన్న తమిళనాడుకు చెందిన ఇద్దరు వ్యక్తులను టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. పట్టణంలోని ఒక లాడ్జిలో వీరిని పట్టుకున్నట్టు సీఐ ఎన్.గణేష్ తెలిపారు. తమిళనాడులోని తంజావూరు జిల్లాకు చెందిన గజపతి జయరామన్ (48), అంభికపతి సాంబశివ (50) ఒడిశాలో రంగురాళ్లు కొనుగోలు చేసి, తుని వెళుతూ నర్సీపట్నంలో ఆగారు. వారు ఇక్కడి లాడ్జిలో ఉన్నట్టు వచ్చిన సమాచారం మేరకు సీఐ సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 63 రకాల రంగురాళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

మట్టి పరీక్ష.. పంటకు రక్ష

- వైఎస్సార్ అగ్రి ల్యాబ్‌లలో భూసార పరీక్షలు
- మట్టి నమూనాల పరిశీలన.. నివేదిక సమర్పణ
- రైతులకు మేలు చేసే సలహాలు, సూచనలు



భూసార పరీక్షల కోసం మట్టి నమూనాలు సేకరిస్తున్న దృశ్యం



సేకరించిన మట్టిన మూనాలను పరీక్ష కేంద్రానికి పంపేందుకు రైతుల వివరాలతో ప్యాక్ చేస్తున్న దృశ్యం

నక్కపల్లి: రైతు సంక్షేమమే ధ్యేయంగా అనేక కార్యక్రమాలు చేపడుతున్న రాష్ట్ర ప్రభుత్వం వారికి మరింత చేయూతనందించి మేలు చేకూర్చే విధంగా భూసార పరీక్షలు చేస్తోంది. జిల్లాలో ఇప్పటికే వ్యవసాయ శాఖ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చిన అధికారులు.. భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఖరీఫ్‌లో లక్ష ఎకరాల్లో వరి సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అంచనాలు వేస్తోంది. సీజన్‌కు ముందే వ్యవసాయ పెట్టుబడుల కోసం రైతు భరోసా కింద ఆర్థిక సాయం అందిస్తున్న ప్రభుత్వం, మట్టి పరీక్షలను కూడా ఉచితంగానే నిర్వహించి మేలైన దిగుబడులు సాధించే దిశగా రైతులను సమాయత్తం చేస్తోంది.

భూసార పరీక్షల ఆధారంగా సాగులో యాజమాన్య చర్యలు చేపడితే తక్కువ పెట్టుబడితో నాణ్యమైన అధిక దిగుబడులు వస్తాయి. భూసారమనేది ఎప్పుడూ ఒకలా ఉండదు. వేసే పంటలు, వాడే క్రిమి సంహారకాలు, ఎరువులను బట్టి మార్పు చెందుతూ ఉంటుంది. ఆయా మార్పులను ఎప్పటికప్పుడు కనిపెట్టి సాగు చేస్తేనే ఆశించిన ఫలితాలు, అధిక దిగుబడులు వస్తాయి. రైతులు అనువైన సమయంలో భూసార పరీక్షలు చేయించుకోవడం ఎంతో అవసరం. వేసవికాలం ప్రారంభమైన నాటి నుంచే మట్టి నమూనాలు సేకరించడం ప్రారంభమయింది. జిల్లాలో గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది అనేక మట్టినమూనాలు సేకరించి అనకాపల్లిలో ఉన్న ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానానికి (భూసార పరీక్షల కేంద్రం), నర్సీపట్నంలో ఉన్న భూసారపరీక్షల కేంద్రానికి పంపిస్తున్నారు. ఇవికాకుండా ఆర్బీకేల ద్వారా కూడా భూసార పరీక్షల కోసం మట్టి నమూనాలను సేకరిస్తున్నారు.

మట్టి నమూనాలు సేకరించే విధానం..

నమూనా సేకరించే చోట నేలపై ఉండే ఆకులను తీసివేయాలి. పారతో నేలపై నుంచి నాగలి చాలు లోతున ఒకే విధమైన నమూనాను తీయాలి. వి ఆకారంలో 6–9 అంగుళాల లోతున పార లేదా తాపీతో అంచు తవ్వి ఆ గుంత నుంచి అంగుళం మందాన పైనుంచి అడుగు దాకా సమానంగా ఒక వైపు నుంచి మట్టిని సేకరించాలి. 10, 12 చోట్ల నుంచి మట్టిని సేకరించి, మెత్తని మట్టిని ఒక గోనె సంచిపై వేసి బాగా కలిపి నాలుగు భాగాలు చేయాలి. ఎదురెదురుగా భాగాలను (1, 4 భాగాలు) కలిపి మిగిలిన భాగాలను తీసివేయాలి. ఇలా అరకిలో వచ్చే వరకు మట్టి నమూనా సేకరించాలి. మాగాణి భూముల్లో నీరు పెట్టకముందు తీయాల్సి ఉంటుంది. నేలరంగును, రకాన్ని బట్టి మెరక పల్లాలు అనుసరించి నమూనాలు సేకరించాలి.

నమూనాలతోపాటు రైతు వివరాలు

నమూనా సేకరించిన పొలానికి సంబంధించి రైతు పేరు, గ్రామం, మండలం, కావాల్సిన పంట, ఇంతకు ముందు వేసిన పంట, వాడిన ఎరువులు, వేయబోయే పంట వంటి వివరాలు కాగితంపై రాసి నమూనా మట్టితో కలిపి పరీక్ష కేంద్రాలకు పంపిస్తారు.

12 పారామీటర్లలో భూసార పరీక్షలు

ఎకరా విస్తీర్ణంలో రైతుల పొలాల నుంచి సేకరించిన మట్టిని 12 పారామీటర్లలో పరీక్షిస్తారు. ఉదజని సూచిక, లవణ సూచిక సేంద్రీయ కర్బనం, స్థూల పోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాసియం, గంధకం, జింక్, కాపర్, మెగ్నీషియం, ఐరన్, బోరాన్ లభ్యత పరీక్షలు నిర్వహిస్తారు. ఇవన్నీ సమతుల్యంగా ఉంటేనే పంటలు అధిక దిగుబడిని ఇస్తాయని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

భూములకు హెల్త్ కార్డులు

భూములకు హెల్త్‌కార్డులు అందజేస్తున్నారు. మట్టినమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించిన అనంతరం భూసార పరీక్షల ఆధారంగానే రైతులకు ఎరువుల సిఫార్సు కలిగిన సాయిల్ హెల్త్‌కార్డులు అందజేస్తున్నట్టు మండల వ్యవసాయాధికారి ఉమాప్రసాద్ తెలిపారు. రైతుల పొలాల్లో సేకరించిన మట్టినమూనాలను అగ్రిల్యాబ్‌లలో పరీక్షించి వచ్చిన నివేదిక ఆధారంగా ఏయే ఎరువులు ఎంత మోతాదులో వాడాలి, ఏయే యాజమాన్య పద్ధతులు పాటించాలనే వివరాలు నమోదు చేసిన కార్డులు అందజేస్తామన్నారు.

అగ్రి ల్యాబ్ నివేదిక ఆధారంగా సాగు



జిల్లాలో ఖరీఫ్‌లో లక్ష ఎకరాల్లో వరి సాగవుతోంది. మే నెలలో జిల్లావ్యాప్తంగా 736 శాంపిళ్లు సేకరించాం. వీటికి భూసార పరీక్షలు నిర్వహించి నివేదికలను ఆర్బీకేల ద్వారా రైతులకు అందజేస్తాం. భూసార పరీక్షల ద్వారా ఏయే పంటలు వేయాలి, ఎంత మోతాదులో ఎరువులు వాడాలి అనేది తెలుసుకోవడం జరుగుతుంది. అన్ని రకాల పంటలు వేసే రైతులకు భూసార పరీక్షలు అనేవి ఎంతో అవసరం.

–మోహన్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి

ఉపాధి కూలీలకు చల్లని కబురు

- ఎండల తీవ్రత కారణంగా అందుబాటులో ఓఆర్ఎస్ ప్యాకెట్లు
- ఇప్పటికే పని ప్రదేశంలో టెంట్లు, నీటి కుండల ఏర్పాటు
- పనివేళలు ఉదయం 5 గంటల నుంచి 10 గంటల వరకు మార్పు
- అందుబాటులో ఫస్ట్ ఎయిడ్ కిట్స్



ఓఆర్ఎస్ ప్యాకెట్లతో ఉపాధి కూలీలు



టెంట్ నీడలో ఉపాధి కూలీలకు మంచినీళ్లు అందిస్తున్న అధికారి

సాక్షి, అనకాపల్లి: ఎండల తీవ్రత ప్రభావం ఎక్కువగా ఉండడంతో జాతీయ ఉపాధి హామీ పథకం కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్నారు. గత రెండు వారాలుగా ఎండలు మండడంతో పని చేసే ప్రాంతాల్లో కూలీలకు మంచినీటి సదుపాయం, నీడ లేని ప్రదేశాల్లో టెంట్లు ఏర్పాటు చేస్తున్నారు. వర్క్ సైట్ ఫెసిలిటీస్‌లో భాగంగా మెడికల్ డిపార్ట్‌మెంట్ వారి సహకారంతో ఫస్ట్ ఎయిడ్ కిట్స్‌ను కూడా అందుబాటులో ఉంచారు. అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ఉదయం 5 గంటల నుంచి 10 గంటల వరకు పనివేళల్లో కూడా మార్పులు చేశారు. నీడ లేని చోట అందుబాటులో ఉన్న టెంట్లతోపాటు తాటాకులతో పందిళ్లు కూడా వేస్తున్నారు. పని ప్రదేశం దగ్గర కుండలు, బిందెలతో మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. ఇప్పటికే వీటిపై కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి డ్వామా అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. క్షేత్ర స్థాయిలో ప్రతి గ్రామంలో అన్ని సదుపాయాలు సక్రమంగా అందుతున్నాయా..? అని ఏపీఓలు, ఎంపీడీఓలు నేరుగా ఉపాధి పనులను కూడా సందర్శించాలని ఆదేశాలు జారీచేశారు. బుధవారం పలు మండల పరిధిలో డ్వామా పీడీ సందీప్‌తో సహా ఆయా మండల ఎంపీడీఓలు, ఏపీఓలు కూడా క్షేత్రస్థాయిలో ఉపాధి పనులను పరిశీలించారు. అక్కడ కూలీలకు అన్ని సదుపాయాలు అందుతున్నాయా..? లేదా అని ఆరా తీశారు. ఎండల సమయంలో నీడ, చెట్లు ఉన్న ప్రాంతాల్లో పనులు చేయాలని సంబంధిత ఫీల్ అసిస్టెంట్లకు కూడా ఆదేశాలు జారీ చేశారు.

జిల్లాలో వివరాలు ఇలా...

జిల్లాలో రోజువారీ పనులకు హాజరవుతున్న వేతనదారులు 1,47,210 మంది
(ఇందులో ఎస్సీలు, ఎస్టీలు 26,012 మంది, దివ్యాంగులు 2,833మంది)
ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇంత వరకు కల్పించిన పనిదినాలు 33 లక్షల 12 వేలు
వీరికి అందిస్తున్న వేతనం రూ.87 కోట్ల 69 లక్షలు

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు



జిల్లాలో ఉపాధి హామీ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. చెరువులు, వ్యవసాయ గట్లు, ఉద్యాన వన పనులు, కాలువలు పూడికతీత, వరద కట్టల నిర్మాణం, మట్టి రోడ్ల నిర్మాణం, ట్రెంచ్ పనులు, రింగ్ ట్రెంచ్ పనులు, ఫామ్ పాండ్స్, డైవర్షన్ డ్రెయిన్లు, ల్యాండ్ డెవలప్‌మెంట్ మొదలైన పనులు చేస్తున్నాం. అంతేకాకుండా జిల్లాలో పెద్దఎత్తున అమృత్ సరోవర్ చెరువులు చేపడుతున్నాం. జిల్లావ్యాప్తంగా 2023 నాటికి 75 చెరువుల లక్ష్యాన్ని మించి 105 అమృత్ సరోవర్ చెరువులు పూర్తి చేశాం.

– సందీప్, డ్వామా పీడీ

బొజ్జన్నకొండపై మయన్మార్ బృందం



బొజ్జన్నకొండను సందర్శించిన మయన్మార్ మత వ్యవహారాలు, సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ప్రతినిధుల బృందం

తుమ్మపాల: ప్రముఖ పర్యాటక ప్రాంతం బొజ్జన్న కొండను మయన్మార్ మత వ్యవహారాలు, సాంస్కృతిక మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి బృందం బుధవారం సందర్శించింది. ఈ బృందంలో ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ న్యోమైంట్‌టున్, అసిస్టెంట్ డైరెక్టర్లు టున్‌టున్‌ఎయ్, ఫియోఫ్యాకెకో, మేమైట్‌నోకో ఉన్నారు. వీరు బొజ్జన్న కొండపై గల పురాతన హీనయాన, మహాయాన, వజ్రయాన వంటి ప్రధాన స్థూపాలతో పాటు పురాతన ఆనవాళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కొండకు గల ప్రత్యేకత, చారిత్రక అంశాలను టూరిజం శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. భారతదేశ పర్యటనలో భాగంగా విశాఖ, అనకాపల్లి జిల్లాలకు వచ్చిన ఈ బృందానికి కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ జిల్లాల కలెక్టర్లు ప్రత్యేక భద్రత, సౌకర్యాలను ఏర్పాటు చేశారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా వారు విశాఖలోని తొట్లకొండ, బావికొండ, పావురాల కొండ ప్రాంతాలను కూడా సందర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టూరిజం అధికారి దాసు, కార్యనిర్వహణ అధికారి నవీన్, పీలా మహోదయ, గైడ్ రామకృష్ణ, పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే క్షేత్రస్థాయి పర్యటనలు



సమస్యలు తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి

కోటవురట్ల : ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు, అందిస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరు, గ్రామ స్థాయిలో సమస్యల పరిష్కారం, మండల అధికారుల పనితీరు తెలుసుకునేందుకే మారుమూల గ్రామాల్లో క్షేత్రస్థాయి పర్యటన చేస్తున్నట్టు కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి తెలిపారు. మండలంలోని బి.కె.పల్లి, యండపల్లి గ్రామాల్లో బుధవారం ఆయన ఆకస్మిక పర్యటన చేశారు. బి.కె.పల్లిలో రీ సర్వేపై అధికారులు పారదర్శకంగా పనిచేస్తున్నారా? లేదా? అని రైతులను అడిగి తెలుసుకున్నారు. పింఛన్ల పంపిణీ, సంక్షేమ పథకాల అమలులో సమస్యల గురించి ఆరా తీశారు. గ్రామంలో గత కొన్ని నెలల్లో నలుగురు వ్యక్తులు మృతి చెందినా, వారి పేర్లను రేషన్ కార్డులో తొలగించకపోవడంపై గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. మినీ గోకులంలో లబ్ధిదారులకు నగదు జమ కాలేదని ఎంపీటీసీ సభ్యుడు పెట్ల రాంబాబు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వాటిని పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హామీ ఇచ్చారు. నిర్మాణ దశలో ఉన్న వెల్‌నెల్ సెంటర్, ఆర్బీకే భవనాలను పరిశీలించి, సకాలంలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఎంపీపీ స్కూల్లో చేపట్టిన నాడు–నేడు పనులను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి చిన్నారులతో మాట్లాడారు. వైఎస్సార్ జగనన్న గృహ నిర్మాణ పథకంలో సొంత స్థలాలు ఉన్న వారిని ప్రోత్సహించాలని హౌసింగ్ ఏఈ జగదీశ్వరరావుకు సూచించారు. ఇంటి పన్నుల వసూళ్లు, జల్ జీవన్ మిషన్ పనులు, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యల పరిష్కార తీరును అడిగి తెలుసుకున్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా ఉపాధి హామీ పథకం పనులను తొందరగా ప్రారంభించాలని సూచించారు. పని ప్రదేశాలలో మంచినీళ్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఎంపీడీవో చంద్రశేఖర్‌ను ఆదేశించారు. యండపల్లిలో హౌసింగ్ లే అవుట్, నిర్మాణదశలో ఉన్న వెల్‌నెస్ సెంటర్‌ను పరిశీలించారు. యండపల్లి మెయిన్‌రోడ్డుకు సమీపంలో ఓ ప్రైవేట్ లే అవుట్‌లో ప్రభుత్వ భూమిని కలిపేశారని, జగనన్న కాలనీ లబ్ధిదారులకు ఇచ్చిన 5 ప్లాట్లను కూడా ఆక్రమించి అక్రమంగా రోడ్డు వేశారని గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై జిల్లా స్థాయి సీనియర్ అధికారిని నియమించి, విచారణ చేపట్టి, చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు చేరేలా క్షేత్ర స్థాయిలో పర్యటిస్తున్నామని చెప్పారు. ఆర్డీవో జయరాం, ప్రత్యేకాధికారి ఉదయశ్రీ, ఎంపీడీవో చంద్రశేఖర్, తహసీల్దారు జానకమ్మ పాల్గొన్నారు.

టీచర్లకు పదోన్నతులు

- అన్ని కేడర్ల వారికి దక్కనున్న ప్రమోషన్
- ఉమ్మడి విశాఖ జిల్లాలో 200 మందికి అవకాశం
- హైస్కూల్, ప్లస్ టూ స్కూళ్లలో పూర్తి స్థాయిలో ఖాళీల భర్తీ
- సబ్జెక్టు టీచర్ల కొరత లేకుండా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాల విడుదల
- సీనియార్టీ జాబితాలపై అభ్యంతరాలకు 19 వరకు గడువు



సబ్జెక్టు టీచర్ల సర్దుబాటుకు నిర్వహించిన కౌన్సెలింగ్ (ఫైల్)

విశాఖ విద్య: ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు బడులు తెరిచే నాటికి ఉద్యోగోన్నతుల ప్రక్రియ పూర్తి చేసేలా డీఈవో కార్యాలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సెకండరీ గ్రేడ్ టీచర్లు నుంచి స్కూల్ అసిస్టెంట్, స్కూల్ అసిస్టెంట్ నుంచి గ్రేడ్–2 హెచ్ఎం, అదే విధంగా ప్లస్ టు స్కూళ్లలో పీజీటీలుగా ఉద్యోగోన్నతి పొందనున్నారు. విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో ఆయా కేడర్లకు చెందిన సుమారు 2 వందల మందికి పైగా ఉద్యోగోన్నతులు దక్కనున్నాయి. ఈ వేసవి సెలవుల్లోనే బదిలీలు నిర్వహించేలా ఉన్నతస్థాయిలో కసరత్తు జరుగుతుండగా, మరో పక్క ప్రమోషన్లకు ప్రభుత్వం అవకాశం కల్పించడంపై ఉపాధ్యాయుల్లో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

తీరనున్న సబ్జెక్టు టీచర్ల కొరత

హైస్కూళ్లు, ప్లస్ టూ స్కూళ్లలో సబ్జెక్టు టీచర్ల కొరత లేకుండా విద్యాశాఖాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. రేషనలైజేషన్‌లో భాగంగా ఈ ఏడాది జనవరిలో 468 మంది ఉపాధ్యాయులను హైస్కూళ్లకు సర్దుబాటు చేశారు. తాజాగా చేపట్టబోయే ఉద్యోగోన్నతులకు వీరిని కూడా పరిగణనలోకి తీసుకోనున్నారు.

2023–24 విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలోని ప్రభుత్వ స్కూళ్లలో పూర్తి స్థాయిలో ఖాళీలను భర్తీ చేసేలా ఉమ్మడి జిల్లా నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్న విశాఖ డీఈవో ఎల్.చంద్రకళ ప్రత్యేక దృష్టి సారించారు.

షెడ్యూల్ ఇలా:–

- హైస్కూల్ ప్లస్ స్కూళ్లలో ఉమ్మడి విశాఖ జిల్లా ప్రాతిపదికన 71 మంది స్కూల్ అసిస్టెంట్లకు పీజీటీలుగా అవకాశం కల్పించేందుకు ఇప్పటికే సీనియార్టీ జాబితాలను ప్రకటించారు. వీరికి ఈ నెల 19న కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.
- సెకండరీ గ్రేట్ టీచర్ నుంచి స్కూల్ అసిస్టెంట్, అదే విధంగా స్కూల్ అసిస్టెంట్ నుంచి గ్రేడ్–2 హెచ్ఎం (ప్రభుత్వ/జెడ్పీ) ప్రమోషన్‌కు బుధవారం సీనియార్టీ జాబితా విడుదల చేశారు. వీటిపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తగిన ధ్రువీకరణ పత్రాలతో ఉపాధ్యాయులు 18, 19 తేదీల్లో డీఈవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. ఉద్యోగోన్నతులకు అర్హులైన ఉపాధ్యాయులు తుది సీనియార్టీ జాబితా 20న ప్రకటిస్తారు. స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్ వద్దనుకునే వారు 21, 22 తేదీల్లో డీఈవో కార్యాలయానికి రాతపూర్వకంగా తెలియజేయాలి.

ఏర్పాట్లు చేస్తున్నాం



ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా ఉద్యోగోన్నతుల జాబితాలను సిద్ధం చేస్తున్నాం. షెడ్యూల్ మేరకు జాబితాలను ప్రకటించి, ఉపాధ్యాయుల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తాం. హైస్కూళ్లలో సబ్జెక్టు టీచర్ల కొరత లేకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. అందరికీ ఆమోదకరమైన రీతిలో ముందుకెళ్తాం.

– ఎల్.చంద్రకళ, నోడల్ అధికారి, ఉమ్మడి విశాఖ జిల్లా

ముందే బదిలీలు నిర్వహిస్తే మేలు



ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్లకు ఉద్యోగోన్నతి కల్పించేందుకు ఉన్నతాధికారులు ఏర్పాట్లు చేస్తుండటం హర్షణీయం. ఈ వేసవిలో బదిలీలు ఉంటాయనే సంకేతాలు ఉన్నాయి. అందుకని బదిలీలు పూర్తయిన తర్వాత పదోన్నతలు ఇస్తే అందరికీ మేలు జరుగుతుంది. ఉన్నతాధికారుల ఆ దిశగా ఆలోచన చేయాలి.

– ఇమంది పైడిరాజు, ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి

మంచి నిర్ణయం



ఉపాధ్యాయులకు మేలు చేసేలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చక్కటి నిర్ణయాలు తీసుకుంటుంది. అర్హులైన ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు కల్పించేలా ఉత్తర్వులు జారీ చేయడం మంచి నిర్ణయం. హైస్కూళ్లలో సబ్జెక్టు టీచర్ల కొరత తీరుతుంది. ఉపాధ్యాయ సంఘాల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి.

– చొక్కాకుల సూర్యనారాయణ, వైఎస్సార్ టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

బాబు నోట మళ్లీ పాత పాట

- పంచగ్రామాల సమస్య పరిష్కరిస్తానని హామీ
- జనం రాకపోవడంతో అసహనం
- చప్పగా సాగిన పెందుర్తి సభ



పెందుర్తి ప్రాంతంలో చంద్రబాబు రోడ్ షో

సింహాచలం: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నోట మళ్లీ అదే మాట.. 2014 ఎన్నికల సమయంలో పంచ గ్రామాల సమస్యను వంద రోజుల్లో పరిష్కరిస్తానని చెప్పారు. బుధవారం నాటి పెందుర్తి సభలో కూడా మళ్లీ అదే హామీ ఇచ్చారు. 2014లో గెలిచిన తర్వాత అదే ఏడాది కేబినెట్ తొలి సమావేశం విశాఖలో పెట్టి పంచగ్రామాల సమస్యను ప్రధానాంశంగా చర్చించారు. ఆ తర్వాత సమస్యపై పట్టించుకోలేదు. పైగా ఐదేళ్ల పాలన ముగుస్తుండగా ఆగమేఘాలమీద 2019లో ప్రత్యేక చట్టం అంటూ జీవో 229 తీసుకొచ్చారు. బుధవారం పెందుర్తిలో బహిరంగ సమావేశానికి వెళ్తూ వేపగుంట జంక్షన్‌లోను, పెందుర్తిలోనూ పంచగ్రామాల భూసమస్యపై చంద్రబాబు మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే సమస్య పరిష్కరిస్తానని చెప్పుకొచ్చారు. చంద్రబాబు పర్యటన దాదాపు రెండు గంటలు ఆలస్యంగా జరిగింది. జనం పలచగా ఉండటం, వచ్చిన వాళ్లలో చాలా మంది వెనుదిరిగి వెళ్లిపోవడంతో అసహనం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

డిప్యూటీ సీఎంకు జేఏసీ నేతల వినతి



బూడికి వినతి పత్రం అందిస్తున్న ఏపీ జేఏసీ నేతలు

చీడికాడ: ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు ఏపీ జేఏసీ అమరావతి, అనకాపల్లి జిల్లా కమిటీ సభ్యులు బుధవారం మండలంలోని ఖండివరంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జేఏసీ అనకాపల్లి జిల్లా చైర్మన్ సింగంపల్లి వాసు, కార్యదర్శి డి.లోవరాజు మాట్లాడుతూ ఏపీ జేఏసీ అమరావతి మూడో దశ ఉద్యమ కార్యాచరణలో భాగంగా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉద్యోగుల వేదనను చెబుదాం అనే నినాదంతో వినతి పత్రం అందించామన్నారు. వీరి సమస్యలను సీఎం జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని డిప్యూటీ సీఎం హామీ ఇచ్చారు. ఏపీఆర్ఎస్ఏ జిల్లా ప్రెసిడెంట్ పి.వి.రత్నం, సెక్రటరీ వై.శ్రీరామమూర్తి, క్లాస్‌ఫోర్ అధ్యక్ష, కార్యదర్శులు టి.వెంకటరమణ, ఎం.ఎస్.ఎస్ శివ పాల్గొన్నారు.

నేడు కేంద్రమంత్రి, మాజీ ఉపరాష్ట్రపతి రాక

మహారాణిపేట: కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి గురువారం విశాఖ వస్తున్నారు. ఢిల్లీ నుంచి విమానంలో సాయంత్రం 5.10 గంటలకు విశాఖ చేరుకుంటారు. అక్కడ నుంచి పాండురంగాపురంలో ఉన్న ఐ.విష్ణురావు ఇంటికి వెళతారు. అక్కడ కొద్ది సేపు ఉంటారు. రాత్రి 10. 30 గంటలకు విమానంలో హైదరాబాద్ వెళతారు,

మాజీ ఉపరాష్ట్రపతికూడా..

మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు గురువారం ఉదయం 11 గంటలకు వాల్తేరు క్లబ్‌లో ఐ.విష్ణురావు సంతాప సభకు హాజరవుతారు. రాత్రికి తిరిగి పోర్టు గెస్టు హౌస్‌కు చేరుకుంటారు. 20న ఉదయం 7.40 గంటలకు విమానంలో బెంగళూరు వెళతారు.

జూలో మరణ మృదంగం

- రెండు నెలల్లో మూడు జంతువుల మృతి
- ఇవన్నీ ఆడ జంతువులే కావడం బాధాకరం
- ఎన్‌క్లోజర్లలో ఒంటరిగా జిరాఫీ, జీబ్రా


ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కులో జంతువులు మృత్యువాత పడుతున్నాయి. ఇక్కడ లేని అరుదైన జంతువులను విదేశాలు, ఇతర రాష్ట్రాల్లో జూ పార్కుల నుంచి తీసుకొచ్చినా వాటి సంతతి పెరగడం లేదు కదా.. ఒక్కొక్కటిగా సందర్శకులకు దూరమవుతున్నాయి. రెండు నెలల వ్యవధిలో జీబ్రా, తెల్ల పులి, జిరాఫీ మృతి చెందడం బాధాకరం. ఇవన్నీ ఆడ జంతువులే. దీంతో వాటి సంతతి వృద్ధి చెందే అవకాశం లేకుండాపోయింది. జీబ్రా, తెల్ల పులి, జిరాఫీ జూకు రాక ముందు వాటి జాడ లేదు. జతలుగా ఇక్కడకు వచ్చిన ఆయా జంతువులు ప్రస్తుతం ఒంటరయ్యాయి.

వైద్య సేవలు అందకేనా.?

జూలో పూర్తిస్థాయి ఆస్పత్రి ఉంది. ఇన్‌పేషెంట్ వార్డు కూడా నిర్మించారు. అనారోగ్యానికి గురయ్యే వన్య ప్రాణులను ఇక్కడ ఇన్‌పేషెంట్ వార్డులో చికిత్స ఉందించే వీలుంది. ఇక్కడ సీనియర్ వైద్యుడు, అసిస్టెంట్‌తో పాటు సహాయకులు ఉన్నారు. అయినా వైద్య సేవలు సరిగా అందకపోవడం వల్లే వన్యప్రాణులు తరచూ మృత్యువాత పడుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. రెండు నెలల వ్యవధిలో మూడు జంతువులు చనిపోవడంపై సందర్శకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్కులోని జంతువులు, పక్షులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరుతున్నారు.

గైనిక్ సమస్యతో...

మలేషియా దేశంలోని నెగ్రా జూ పార్కు నుంచి 2013లో అప్పటి జూ క్యూరేటర్ రామలింగం ఓ జత జిరాఫీలను ఇక్కడకు తీసుకొచ్చారు. మలేషియా నుంచి ఓడలో మూడు జిరాఫీలను చెన్నై పోర్టుకు తీసుకొస్తుండగా.. వాటిలో మగ జిరాఫీ సముద్ర మార్గ మధ్యలోనే మృతి చెందింది. మిగిలిన జిరాఫీలు విశాఖ జూ పార్కుకు చేరాయి. అప్పటికి మగ జిరాఫీ(బేకస్) వయసు ఏడాదిన్నర కాగా.. ఆడ జిరాఫీ(మే)కి నాలుగు నెలలే.. అవి జూలోనే పెరిగి పెద్దయ్యాయి. ఈ క్రమంలో జిరాఫీల సంఖ్యను వృద్ధి చేయాలనే ఆలోచనతో 2019లో అప్పటి క్యూరేటర్ యశోదబాయి వాటి పునరుత్పత్తికి బాటలు వేశారు. ఈ నేపథ్యంలో గర్భం దాల్చిన ఆడ జిరాఫీకి పుట్టిన పిల్ల 12 రోజుల్లో మృతి చెందింది. మరోసారి 2020లో కూడా గర్భం దాల్చిన ఆ జిరాఫీ కడుపు లోపలే పిల్ల మరణించింది. అప్పటి నుంచి 'మే' గైనిక్ సమస్యతో బాధపడుతున్నట్లు జూ అధికారులు తెలిపారు. ఈ సమస్య మరింత విషమించి.. మూడు నెలలుగా ఆహారం కూడా సరిగా తీసుకోకపోవడంతో నీరసించిపోయింది. బుధవారం తెల్లవారుజామున ప్రాణాలు విడిచింది. దీంతో ఈ జాతి జంతువుల సంతతి పెరిగే అవకాశం లేకుండాపోయింది. మరోవైపు మగ జిరాఫీ ఎన్‌క్లోజర్‌లో ఒంటరిగా మిగిలిపోయింది. సాధారణంగా జిరాఫీలు 20 నుంచి 25 ఏళ్లు జీవిస్తాయి. జూలో మంచి వైద్యం, ఆహారం క్రమం తప్పకుండా అందిస్తారు కాబట్టి.. వాటి జీవిత కాలం మరింత పెరుగుతుంది. కానీ ఇక్కడ జిరాఫీ 10 ఏళ్లకే మృత్యువాత పడటం.. జూ అధికారులు సైతం జీర్ణించుకోలేకపోతున్నారు.



బుధవారం మృతి చెందిన ఆడ జిరాఫీ(ఫైల్)

తిండి తినక.. నీరసించి..

ఇక్కడ రాణి అనే జీబ్రా రెండు నెలల కిందట మృతి చెందింది. నాలుగేళ్లకు ముందు ఇక్కడ జూలో జీబ్రాలు లేవు. 2019 నవంబరులో అప్పటి జూ క్యూరేటర్ యశోదభాయి ఓ జత జీబ్రాలను కోల్‌కతాలోని అలిపూర్ జూ పార్కు నుంచి జంతు మార్పిడి పద్ధతిలో ఇక్కడకు తీసుకొచ్చారు. వాటికి బదులుగా ఇక్కడ నుంచి ఐదు అడవి కుక్కల(రేచు కుక్కలు)ను పంపించారు. అప్పటి నుంచి జీబ్రాలు సందర్శకులను అలరిస్తూ వచ్చాయి. వాటిలో మగ జీబ్రాకు రాజు, ఆడ జీబ్రాకు రాణి అని పేర్లు పెట్టారు. ఏడేళ్ల వయసు ఉన్న ఆడ జీబ్రా రాణి కొంత కాలం కిందట అనార్యోగానికి గురైంది. ఆహారం తినకుండా ఇసుక, మట్టి తినడం వల్ల బాగా నీరసించిపోయింది. సాధారణంగా ఆరోగ్యం బాగాలేనప్పుడు ఇసుక, మట్టి తినడం జీబ్రాల లక్షణం. జూ పార్కుల్లో ఉండే జీబ్రాలు ఇసుక, మట్టి తినేటప్పుడు వాటి ఆరోగ్యం బాగా లేదని అధికారులు, జూ వైద్యులు గమనించి.. వాటికి అవసరమైన వైద్యం అందిస్తుంటారు.

కానీ ఇక్కడ వైద్యులు జీబ్రా ఇసుక తింటున్న విషయం పసికట్టలేకపోయారు. దీంతో అనారోగ్యానికి గురైన ఆడ జీబ్రా ఈ ఏడాది మార్చి 12న మృతి చెందింది. జీబ్రాకు పోస్టుమార్టం నిర్వహించినప్పుడు దాని పొట్ట నుంచి 16 కిలోల ఇసుక బయటపడటం అధికారులను విస్మయానికి గురిచేసింది. రాణి మృతి చెందినప్పటి నుంచి రాజులో హుషారు తగ్గిపోయింది.



మార్చి 12న మృతి చెందిన ఆడ జీబ్రా(ఫైల్)

అనారోగ్యంతో...



ఈనెల 8న మృతి చెందిన తెల్ల పులి(ఫైల్)

తెల్ల పులి కుమారి(19) ఈ నెల 8న మృతి చెందింది. 2007 కంటే ముందు ఇందిరాగాంధీ జూ పార్కులో తెల్ల పులులు లేవు. అప్పటి జూ అధికారులు హైదరాబాద్‌లోని నెహ్రూ జూలాజికల్ పార్కు నుంచి ఓ జత తెల్ల పులులను ఇక్కడకు తీసుకొచ్చారు. వాటిలో కుమారి అనే ఆడ తెల్ల పులి మూడు సార్లు గర్భం దాల్చి 9 కూనలకు(పిల్లలు) జన్మనిచ్చింది. దీంతో జూలో వాటి సంతతి పెరిగింది. వాటిలో కొన్నింటిని జంతు మార్పిడి పద్ధతి ద్వారా ఇతర జూ పార్కులకు తరలించి.. అక్కడ నుంచి కొన్ని జంతువులను ఇక్కడకు తీసుకొచ్చారు. కాన్పూర్ జూకు రెండు తెల్ల పులులను ఇచ్చి.. అక్కడ నుంచి ఒక మగ ఖడ్గ మృగాన్ని ఇక్కడకు తీసుకొచ్చారు. 19 ఏళ్ల వయసుగల కుమారి వృద్ధాప్యం, అనారోగ్యం కారణంగా ఈ నెల 8న మృతి చెందింది. ప్రస్తుతం జూలో ఐదు తెల్ల పులులున్నాయి.

మెరుగైన వైద్యం అందిస్తున్నాం



జూలోని జంతువులు, పక్షులకు మెరుగైన వైద్యం అందిస్తున్నాం. కొన్ని జంతువులు అనారోగ్యానికి గురై మృతి చెందుతున్నాయి. జిరాఫీ మెట్రిటిస్, నిమోనియాతో కొన్నాళ్లుగా బాధపడుతోంది. అందుకు తగిన వైద్యం అందించినప్పటికీ మరణించింది. తెల్ల పులి వృద్ధాప్యంతో మృతి చెందింది. జీబ్రా తక్కువ వయసులోనే మరణించడం బాధాకరం. మరింత మంచి వైద్యం అందించి వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం ఒంటరైన జంతువుల తోడు కోసం.. ఇతర జూ పార్కుల నుంచి ఆయా జంతువులను తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటాం.

– నందనీ సలారియా, జూ క్యూరేటర్

రేపు ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీయర్ సర్వీస్ సెంటర్‌లో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు సీహెచ్ సుబ్బిరెడ్డి (క్లరికల్), కె.సుధ (టెక్నికల్) తెలిపారు. పలు ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో 660 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఆపరేటర్, కస్టమర్ రిప్రజెంటేటివ్, ఎగ్జిక్యూటివ్, క్యాషియర్, జూనియర్ క్యాడ్ ఇంజినీర్, వేర్‌హౌస్ అసోసియేట్స్, జీఐఎస్ ఇంజినీర్ కేడ్, టెలికాలింగ్, అకౌంటెంట్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్, కేర్ టేకర్స్, ఎఎన్ఎం, డేటా ఎంట్రీ, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, రిలేషన్‌షిప్ అధికారులు, ప్లానింగ్ అధికారి, ఐటీ రిక్రూటర్, ట్రైనీలు, మేనేజర్స్ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియేట్, ఏదైనా డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, బీకామ్ (టాలీ), బీటెక్, ఎంబీఏల్లో ఉత్తీర్ణత సాధించిన 18–40 సంవత్సరాల స్త్రీ,పురుష అభ్యర్థులు అర్హులన్నారు. ఆయా ఉద్యోగం బట్టి జీతం నెలకు రూ10వేలు నుంచి రూ35,000ల వరకు ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ncs.gov.in వెబ్‌సైట్ నందు తమ పేర్లు రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.

యూపీఎస్సీ పరీక్షకు పక్కా ఏర్పాట్లు

విశాఖ విద్య: జిల్లాలో ఈ నెల 28న జరగనున్న యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. యూపీఎస్సీ పరీక్ష నిర్వహణపై బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 29 సెంటర్లలో 10,865 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు. రెండు జోన్లలో జరుగుతున్న పరీక్షలకు భీమిలి, విశాఖపట్నం ఆర్డీవోలు జోనల్ అధికారులుగా ఉంటారన్నారు. ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు రెండు షిఫ్టుల్లో పరీక్షలు జరుగుతాయన్నారు. గంట ముందుగా మాత్రమే పరీక్ష కేంద్రం తెరవాలన్నారు. పరీక్ష ప్రారంభమయ్యే 10 నిమిషాలకు ముందు మాత్రమే అభ్యర్థులను కేంద్రంలోకి అనుమతించాలని చెప్పారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తప్పనిసరిగా గుర్తింపు కార్డు తీసుకురావాలన్నారు. మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, డిజిటల్ పరికరాలు వంటివి అనుమతించమన్నారు.

గాజుసీసాతో ఆటోడ్రైవర్‌పై దాడి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మణ

రోలుగుంట: మండలంలోని కుసుర్లపూడికి చెందిన ఆటో డ్రైవర్ ఎడ్ల లక్ష్మణ్(42)పై అదే గ్రామానికి చెందిన ఎర్రి గురుబాబు గాజుసీసాతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. బుధవారం రాత్రి 10 గంటల సమయంలో జానకీరాంపురం సమీపాన జీడిపిక్కల పరిశ్రమ నుంచి మహిళా కార్మికులను తీసుకురావడానికి ఎప్పటి మాదిరిగానే వెళ్తుండగా మార్గమధ్యంలో ఆయిల్‌పామ్ తోట వద్ద పైల అర్జున్ ఆటో ఆపాడు. అంతలో గురుబాబు అక్కడికి వచ్చి ఆటో అద్దాన్ని అటూఇటూ తిప్పుతుండగా డ్రైవర్ వద్దని వారించాడు. దాంతో ఇద్దరి మధ్య వాగ్వాదం పెరిగింది. దీంతో గురుబాబు తనకు దొరికిన గాజుసీసాతో తలపైనా, చేతులపైనా దాడి చేసి లక్ష్మణ్‌ను గాయపరిచాడు. స్థానికులు వెంటనే నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. స్థానిక ఎస్సై బి.నాగకార్తీక్ కేసు నమోదు చేశారు.

రైల్లోంచి జారి పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి



యలమంచిలి: ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన యలమంచిలి రైల్వే స్టేషన్ సమీపంలో బుధవారం జరిగింది. తుని ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్సై షేక్ అబ్దుల్ మారుఫ్ తెలిపిన వివరాలివి.... అనకాపల్లి నుంచి తుని వైపు వెళ్లే గుర్తు తెలియని రైలు నుంచి యలమంచిలి రైల్వే స్టేషన్ సమీపంలో ప్రయాణికుడు (40) జారి పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని యలమంచిలి ప్రభుత్వాసుపత్రికి రైల్వే స్టాఫ్ తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. రైల్వే పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి వివరాలు తెలియరాలేదని, మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచామన్నారు. మృతుని ఆచూకీ తెలిస్తే తుని ప్రభుత్వ రైల్వే స్టేషన్‌లో 9490619020, 9494887786లకు సంప్రదించాలని కోరారు.

ఫెడరేషన్ కప్‌లో జ్యోతికి స్వర్ణం



జ్యోతి స్వర్ణం సాధించిన జ్యోతి

విశాఖ స్పోర్ట్స్: నేషనల్ ఫెడరేషన్ కప్ సీనియర్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో నగర స్ప్రింటర్ జ్యోతి ఎర్రాజీ స్వర్ణాన్ని కైవసం చేసుకుంది. రాంచీలోని బిర్లా ముండా స్టేడియంలో బుధవారం జరిగిన 100 మీటర్ల హార్డిల్స్‌ను 12.89 సెకన్లలోనే పూర్తి చేసి విజేతగా నిలిచింది. మంగళవారం జరిగిన ఫైనల్స్ క్వాలిఫైయింగ్ రౌండ్‌లోనూ 13.18 సెకన్లలోనే పూర్తి చేసి తుది పోరుకు అర్హత సాధించింది. జాతీయ రికార్డును 12.82 సెకన్లలో పూర్తి చేసి తన పేరునే లిఖించుకున్న జ్యోతి.. మీట్ రికార్డ్‌ను 13.43తో సాధించింది. తమిళనాడుకు చెందిన నిత్యారామ్‌రాజ్ 13.44 సెకన్లలో, జార్ఖండ్‌కు చెందిన సప్నకుమారి 13.58 సెకన్లలో పరుగు పూర్తి చేసి ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. అత్యుత్తమ అథ్లెటిక్ ప్రతిభతో ఉత్కంఠగా సాగుతున్న ఈ సీనియర్స్ మీట్‌లో విజేతగా నిలవడంతో జ్యోతికి ఆసియన్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌కు మార్గం సుగమమైంది. ఆసియా అథ్లెటిక్ చాంపియన్‌షిప్ జూలై 12–16 వరకు బ్యాంకాక్‌లో జరగనుంది.

వేధింపుల కేసులో ఏడాది జైలు శిక్ష

విశాఖ లీగల్ : బాలికను లైంగికంగా వేధించిన కేసులో నేరం రుజువు కావడంతో నిందితునికి ఏడాది కఠిన కారాగార శిక్ష, రూ.60 వేల జరిమానా విధిస్తూ పోక్సో కేసుల ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి జి.ఆనంది తీర్పు వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి అదనపు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కరణం కృష్ణ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. కంటా సుమన్ (37) పెదగంట్యాడ ఏపీహెచ్‌సీ కాలనీ ప్రాంత నివాసి. స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్టు పనులు చేస్తూ ఉండేవాడు. ఈ క్రమంలో 2015 సెప్టెంబర్ 27న భార్య ఫంక్షన్‌కు వేరే ఊరు వెళ్లింది. దీంతో ఇంటిలో వంట చేసేందుకు సమీపంలోని బంధువుల బాలికను రమ్మన్నాడు. మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో వంట చేస్తున్న బాలికపై సుమన్ లైగింక వేధింపులకు పాల్పడ్డాడు. బెదిరిపోయిన బాలిక ఇంటికి వెళ్లి తల్లికి చెప్పింది. వెంటనే ఆమె పెదగంట్యాడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు సుమన్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. నేరం రుజువు కావడంతో సుమన్‌కి ఏడాదిపాటు కఠిన కారాగార శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. అలాగే రూ.50 వేల జరిమానా ఫిర్యాదికి చెల్లించాలని, మరో రూ.10 వేలు జరిమానా కోర్టుకు చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.

లారీ, ఆర్టీసీ బస్సు ఢీ



దెబ్బతిన్న బస్సు ముందుభాగం

రాంబిల్లి: వెంకటాపురం–రాంబిల్లి ప్రధాన రహదారిపై లాలంకోడూరు జంక్షన్ వద్ద లారీ, ఆర్టీసీ బస్సు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో డ్రైవర్ సహా ప్రయాణికులకు ఎటువంటి గాయాలు కాలేదు. బస్సు ముందు భాగం మాత్రం దెబ్బతింది. దీనిపై తమకు ఫిర్యాదు వచ్చిన తర్వాత కేసు నమోదు చేస్తామని ఎస్ఐ దీనబంధు తెలిపారు.

అట్రాసిటీ కేసులో ఒకరికి రిమాండ్

నర్సీపట్నం: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో ఒకరిని టౌన్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నర్సీపట్నం మున్సిపాలిటీ బలిఘట్టంలో ఈ నెల 3న మరిడమ్మ జాతర సందర్భంగా దళిత యువకుడిపై దాడి చేయడంతో సుర్ల అప్పలనాయుడు, మరి కొంతమందిపై అట్రాసిటీ కేసు నమోదు చేశారు. డీఎస్పీ కె.ప్రవీణ్‌కుమార్ విచారణ అనంతరం బుధవారం సుర్ల అప్పలనాయుడిని అరెస్టు చేసి విశాఖ సెంట్రల్ జైలుకు తరలించారు.

టెన్త్ మార్కుల జాబితాలో తప్పిదాల సవరణకు అవకాశం

విశాఖ విద్య: పదో తరగతి మార్కుల జాబితాలో తప్పిదాల సవరణకు ప్రభుత్వ ఎగ్జామినేషన్ బోర్డు డైరెక్టర్ అవకాశం కల్పించినట్లు డీఈవో ఎల్. చంద్రకళ బుధవారం తెలిపారు. ఈ ఏడాది పదో తరగతి పాసైన విద్యార్థులకు ఇప్పటికే షార్ట్ మెమోలను జారీ చేశామన్నారు. దీనిలో ఏమైనా తప్పిదాలు ఉన్నట్లుగా గుర్తించినట్లైతే, తగిన ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 20 నాటికి అందజేయాలన్నారు.

కాచిగూడ ఎక్స్‌ప్రెస్ మహబూబ్‌నగర్ వరకు పొడిగింపు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం–కాచిగూడ ఎక్స్‌ప్రెస్‌ను ప్రయాణికుల సౌకర్యార్థం ఈ నెల 20వ తేదీ నుంచి మహబూబ్‌నగర్ వరకు పొడిగిస్తున్నట్లు వాల్తేర్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నంలో ప్రతి రోజూ సాయంత్రం 6.40 గంటలకు బయలుదేరే విశాఖపట్నం–కాచిగూడ (12861) ఎక్స్‌ప్రెస్ మరుసటిరోజు ఉదయం 6.45 గంటలకు కాచిగూడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 6.55 గంటలకు బయలుదేరి ఉదయం 9.20 గంటలకు మహబూబ్‌నగర్ వెళ్తుంది. తిరుగు ప్రయాణంలో కాచిగూడ–విశాఖపట్నం (12868) ఎక్స్‌ప్రెస్ మహబూబ్‌నగర్‌లో ప్రతి రోజూ సాయత్రం 4.10 గంటలకు బయలుదేరి, 6.10 గంటలకు కాచిగూడ వస్తుంది. అ క్కడ నుంచి 6.20గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉద యం 6.50 గంటలకు విశాఖ పట్నం చేరుకుంటుంది.

20న డీటీపీ పోస్టుకు రాత పరీక్ష

మహారాణిపేట: వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్టు విభాగంలో డేటా ఎంట్రీ ఆపరేటర్ (డీటీపీ) ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్నవారికి ఈ నెల 20 సత్యం జంక్షన్ సమీపంలో ఉన్న క్రాంతి నగర్ (నక్కవానిపాలెం)లో శ్రీ శారద విద్య నిలయం ప్రాంగణంలో కంప్యూటర్ పరీక్షలను నిర్వహిస్తున్నారు. అర్హులైన అభ్యర్థులు ఆధార్ కార్డును తీసుకొని 20వ తేదీన ఉదయం 9 గంటలకు శ్రీ శారద విద్య నిలయం ప్రాంగణానికి చేరుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి(డిఎంహెచ్ఒ) డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు.

భర్తను హతమార్చిన కేసులో ఏడో నిందితుడు అరెస్టు

చోడవరం రూరల్: పక్కా ప్రణాళికతో సినిమా ఫక్కీలో భర్తను హతమార్చిన భార్య కేసుకు సంబంధించి ఏడో నిందితుడు అనకాపల్లికి చెందిన పంచదారల కనకసాయి ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. కేసు దర్యాప్తు చేస్తున్న చోడవరం సీఐ బి. శ్రీనివాసరావు బుధవారం వెల్లడించిన వివరాల ప్రకారం... ఏప్రిల్ 17న చోడవరం మారుతీనగర్‌లో ఉద్రాక్ష హరివిజయ్‌ను హత్య చేసి మృతదేహాన్ని అల్లూరి సీతారామరాజు జిల్లాలోని హతుడు స్వగ్రామం ముంచంగిపుట్టు మండలం చివుకుచింతకు కారులో తరలిస్తుండగా పాడేరులో గస్తీ పోలీసులకు చిక్కిన విషయం విదితమే. ఈ కేసులో భార్య ప్రీతి, ఆమె తండ్రి శంకరరావు, ప్రియుడు బలయాది సింహసాయి ప్రణయ్‌లతోపాటు ఏడుగురి ప్రమేయం ఉన్నట్టు సాక్ష్యాధారాలను సేకరించారు. ఈ మేరకు అచ్యుతాపురం మండలం చోడాపల్లికి చెందిన లావేటి లలిన్‌కుమార్, అచ్యుతాపురానికి చెందిన కర్రి రాము, అనకాపల్లికి చెందిన పిట్లకొండ రాజు అలియాస్ బషేర్‌లను ఈ నెల ఒకటిన అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పట్లో ఏడో నిందితుడు పంచదారల కనకసాయి వివరాలు వెల్లడించకుండా పోలీసులు గోప్యత పాటించారు.

ఎట్టకేలకు అనకాపల్లి శారదా నది ఒడ్డున శివాలయం వద్ద కనకసాయిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు. ఈ కేసుకు సంబంధించి నిందితులందరినీ అరెస్టు చేసినట్టయ్యిందని, త్వరలోనే చార్జిషీటు దాఖలు చేస్తామని పేర్కొన్నారు.

కొత్త అల్లుడి బైకు చోరీ

చోడవరం రూరల్: మండలంలోని గోవాడలో కొత్త బైకు చోరీకి గురైంది. గ్రామానికి చెందిన బుదిరెడ్ల ప్రకాష్ కుమార్తె వివాహం ఈ నెల 13న జరిగింది. కొత్త అల్లుడికి పల్సర్ బైకును కానుకగా ఇచ్చారు. మంగళవారం అల్లుడు, కుమార్తె దానిపై గోవాడ శివాలయం ఎదురుగా అత్తవారింటికి వచ్చారు. ఆ ఇంటికి సమీపంలోనే పార్కింగ్ చేశారు. బుధవారం ఉదయం చూసేసరికి మాయమైంది. మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని ఇద్దరు అక్కడ పార్కింగ్ చేసిన వేరొకరి బైకు చోరీకి ప్రయత్నించారని, ఆ సమయంలో మనుషుల అలికిడి కావడంతో అక్కడి నుంచి జారుకుని కొత్త పల్సర్ బైకుతో ఉడాయించి ఉంటారని అనుమానిస్తున్నారు.

ఈ చోరీకి సంబంధించి ఫిర్యాదు అందలేదని, గ్రామంలోని సీసీ కెమెరాల ద్వారా పరిశీలిస్తున్నట్టు చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు తెలిపారు.

ర్యాష్ డ్రైవింగ్ చేసిన వారికి జరిమానా

చోడవరం ఆర్టీసీ కాంప్లెక్సు వద్ద బుధవారం సాయంత్రం ర్యాష్ డ్రైవింగ్ చేసిన ద్విచక్ర వాహనదారులకు జరిమానాలు విధించారు. సాయంత్రం నిర్వహించిన రహదారి నిబంధనలను అతిక్రమించిన వారికి, దురుసుగా వాహనాలను నడిపిన వారికి కౌన్సెలింగ్ చేసి మోటారు వాహన చట్టం ప్రకారం జరిమానాలు విధించినట్టు సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

10 వేల లీటర్ల బెల్లం పులుపు, సామగ్రి ధ్వంసం

- తురువోలులో మహిళా పోలీసు, యువకులకు అభినందన

చీడికాడ: మండలంలోని తురువోలులో పది వేల లీటర్ల బెల్లం పులుపును పారబోయడంతోపాటు సారా తయారీకి ఉపయోగించే సామగ్రిని మహిళా పోలీసు, యువకులు బుధవారం ధ్వంసం చేశారు. గ్రామంలో సారా తయారీ, అమ్మకాలు ఇటీవల కాలంలో పెరగడంతో ఆగ్రహించిన యువకులు గ్రామ సచివాలయం మహిళా పోలీసు జి.సుజాతను వెంటబెట్టుకుని సుమారు 40 చిన్నా, పెద్దా ప్లాస్టిక్ డ్రమ్ముల్లో బెల్లం ఊట (పులుపు)ను ప్లాస్టిక్ సీసాలో రెండు లీటర్ల సారాను పారబోశారు. అనంతరం ఆ డ్రమ్ములను, తయారీ పాత్రలను కర్రలతో ధ్వంసం చేసి నిప్పు పెట్టారు. యువకుల సాహస కార్యాన్ని మహిళలు అభినందించారు.



సారా తయారీ సామగ్రిని ధ్వంసం చేస్తున్న యువకులు

కేజీహెచ్‌లో ఈవెనింగ్ ఓపీ ప్రారంభం

- సాయంత్రం 3 నుంచి 4 గంటల వరకు వైద్య సేవలు
- రోగులకు మెరుగైన సేవలు అందించే దిశగా చర్యలు

మహారాణిపేట : పేదల పెద్దాస్పత్రి కేజీహెచ్‌లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడం కోసం ప్రభుత్వం మరిన్ని చర్యలు చేపట్టింది. రోగులకు చెందిన వివిధ పరీక్షల రిపోర్ట్స్ అదే యూనిట్ వైద్యులు చూడడం ప్రధాన ఉద్దేశంగా ఈవెనింగ్ అవుట్ పేషెంట్ (ఓపీ) వైద్య సేవలకు బుధవారం శ్రీకారం చుట్టారు.

తొలి విడతగా గైనిక్, డెర్మటాలజీ విభాగాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 వరకు ఓపీ నిర్వహించారు. రానున్న రోజుల్లో బ్రాడ్ స్పెషాలిటీస్ కిందకు వచ్చే మెడిసిన్, సర్జన్స్, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్స్ విభాగాల ఓపీ ప్రారంభిస్తామని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్ తెలిపారు.

ఆరో విభాగాల్లో ఏర్పాట్లు : మొత్తం ఆరు విభాగాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 వరకు ఓపీ నిర్వహించడానికి కేజీహెచ్‌లో ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం ఏ ఓపీలు చూశారో సాయంత్రం కూడా అవే ఓపీల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకు అవసరమైన వైద్యులు, నర్సులు, పారా మెడికల్ సిబ్బంది, ఇతర సిబ్బందిని నియమిస్తున్నారు. అవసరమైన వారి డ్యూటీల్లో మార్పులు చేస్తున్నారు. ఇటీవల అమరావతిలో రెండు రోజులపాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమాల్లో ఈవెనింగ్ క్లినిక్స్ ఏర్పాటు చేయాలనే ఆలోచనపై చర్చ జరిగింది. ఈ ప్రకారం ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర వైద్య విద్య డైరెక్టర్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం బోధన ఆస్పత్రుల్లో ఈవెనింగ్ ఓపీలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. కేజీహెచ్‌లో నిర్వహిస్తున్న ఈవెనింగ్ ఓపీలను సూపరింటెండెంట్ పి.అశోక్ కుమార్ పర్యవేక్షిస్తున్నారు.

క్లుప్తంగా

ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు



బయ్యవరంలో ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేసిన సిబ్బంది

కశింకోట : మండలంలోని జాతీయ ఉపాధి హామీ పథకం కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను బుధవారం పంపిణీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా బయ్యవరం, అడ్డాం, వెదురుపర్తి తదితర గ్రామాల్లో ఉపాధి పనులు నిర్వహిస్తున్న కూలీలకు అందజేశారు. మండలంలో సుమారు 5,500 మంది ఉపాధి కూలీలు పని చేస్తున్నారని, వారికి ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్నట్లు ఏపీవో శివ తెలిపారు. ఈ పంపిణీలో ఎఎన్ఎంలు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

వేసవి శిబిరంలో చిత్రలేఖనం పోటీలు



విద్యార్థులు వేసిన చిత్రాలు

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం నిర్వహించిన చిత్ర లేఖనం పోటీలకు విశేష ఆదరణ లభించింది. 34 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, తమ నైపుణ్యాన్ని పేపర్‌పై పెట్టారు. వీరిలో పి.జ్యోత్స్నప్రియ విజేతగా నిలిచారు. ఉపాధ్యాయుడు బి.సురేష్‌కుమార్, గ్రంథాలయ అధికారి కె.జగన్నాథం ఆధ్వర్యంలో పోటీ నిర్వహించారు.

రేపటి నుంచి 'వలంటీర్లకు వందనం'

కశింకోట : మండలంలో గ్రామ వలంటీర్లను అభినందించే 'వలంటీర్లకు వందనం' కార్యక్రమాన్ని ఈ నెల 19 నుంచి 30 వరకు సచివాలయాలు, పంచాయతీ కార్యాలయాల్లో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. నిర్దేశించిన షెడ్యూల్ మేరకు రోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట మధ్య కార్యక్రమం జరుగుతుందన్నారు. ఇందుకు పంచాయతీ కార్యదర్శులను నోడల్ అధికారులుగా నియమించామన్నారు. తొలిరోజైన 19న ఉగ్గినపాలెం, తాళ్లపాలెం, 20న జి.భీమవరం, అచ్చెర్ల, 22న ఇ.చౌడువాడ, 24న కశింకోట, 25న వెదురుపర్తి, 26న నూతలగుంటపాలెం, జెట్టపురెడ్డితుని, 27న చింతలపాలెం, ఏఎస్ పేట, 29న తీడ, కొత్తపల్లి, 30న జమాదులపాలెం, బయ్యవరంల్లో స్థానిక ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో జరగనుందన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు బుధవారం 117 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,730	4,620
రెండో రకం	4,540	4,270
మూడోరకం	3,930	3,920

అనకాపల్లి సినిమాలు

కస్టడీ	రాజా
రామబాణం	సత్యనారాయణ-1
అన్నీ మంచి శకునములే	సత్యనారాయణస్క్రీన్-2
ది కేరళ స్టోరీ	షిర్డీసాయి
విరూపాక్ష	పర్తిసాయి
ఫాస్ట్ అండ్ ఫ్యూరియస్10	వెంకటేశ్వర
ఉగ్రం	శ్రీసత్య
ఏజెంట్	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 115 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-7 యూనిట్లు, బీ పాజిటివ్-37 యూనిట్లు, ఓ పాజిటివ్-71 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 385 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 393 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

ప్రకృతి సేద్యం.. భూమి భద్రం



భూమి సారవంతానికి విత్తన కిట్లను సిద్ధం చేస్తున్న సిబ్బంది



సుందరయ్యపేటలో విత్తన కిట్లను అందిస్తున్న కూండ్రపు అరుణ

భూమి బాగుంటేనే మనం బాగుంటాం. రసాయనాలకు దూరంగా.. ప్రకృతి సిద్ధంగా నేల సారాన్ని పెంచితే.. భూమి.. పంట ఉత్పత్తులతో మన ఆరోగ్యం భద్రం. అందుకే ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయ సాగును ప్రోత్సహిస్తోంది. నేల సారాన్ని పెంచే 30 రకాల చిరు, నవధాన్యాల విత్తనాలను రైతులకు అందిస్తోంది.

- ప్రకృతి వ్యవసాయంపై రైతుల ఆసక్తి
- చిరు, నవధాన్య విత్తన కిట్ల పంపిణీలో అధికారులు
- మూడేళ్లు సాగు చేస్తే చాలు, రసాయనాలతో పని ఉండదు

కశింకోట : మండలంలో ప్రకృతి వ్యవసాయం సాగుకు రైతులను అధికారులు సన్నద్ధం చేస్తున్నారు. పది గ్రామాల్లో 1800 ఎకరాల్లో ఈ ఏడాది ప్రకృతి వ్యవసాయం సాగు లక్ష్యంగా అధికారులు ముందుకెళ్తున్నారు. దీన్లో భాగంగా భూసారం పెంచేందుకు తొలకరి వర్షాలకు ముందు 30 రకాల చిరు, నవ ధాన్యాల సాగుకుకు విత్తనాలను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే తొలి విడతగా 750 విత్తన కిట్ల పంపిణీకి చర్యలు చేపట్టారు. మిగిలిన రైతులకు కూడా విడతల వారీగా విత్తనాలను అందించనున్నారు.

విత్తన కిట్ల పంపిణీ చర్యలు

మండలంలోని స్వయం సహాయక సంఘాల సభ్య రైతులు, సాధారణ రైతుల సహకారంతో జి.భీమవరం, అచ్చెర్ల, మోసయ్యపేట, తాళ్లపాలెం, బంగారయ్యపేట, జి.సింగవరం, అడ్డాం, సుందరయ్యపేట, ఆనందపురం, చెరకాం గ్రామాల్లో 1800 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం సాగుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ పద్ధతిలో తొలుత నేలను సారవంతం చేసేందుకు చిరు, నవ ధాన్యాలను నాటి సాగు చేయాలి. ఇందుకు అవసరమైన విత్తనాలను ఉత్తరాంధ్ర, రాజమండ్రి, కాకినాడ తదితర ప్రాంతాల నుంచి సేకరించారు. వాటిని నిర్ణీత మోతాదు మేరకు కలిపి ప్యాకింగ్ చేశారు. ఇవి ఎకరాకు 12 కిలోల వంతున నాటుకుంటే ఏడాది పాటు ఇక ఎరువులతో పనిలేదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. దీంతో రానున్న తొలకరిలో భూమిని దున్నినాటేందుకు వీలుగా గ్రామ సంఘాల సాయంతో ప్రకృతి వ్యవసాయ విభాగం అధికారులు ఇప్పటికే 750 విత్తన కిట్ల పంపిణీ చేపట్టారు.

కలియదున్నితే చాలు

కిట్‌లో ఉన్న విత్తనాలను పొలంలో చల్లాలి. దాదాపు 45 రోజుల్లో ఇవి ఏపుగా ఎదుగుతాయి. అప్పుడు వీటిని భూమిలో కలియ దున్నితే చాలు. భూమిలో సేంద్రీయ కర్బన శాతం వృద్ధి చెంది ఖరీఫ్, రబీ సాగులో పంట ఎదుగుదల, ఆరోగ్యవంతానికి సహజ సిద్ధ ఎరువుగా పనిచేస్తుంది. కలుపు నియంత్రణతోపాటు, చీడ పీడలు, తెగుళ్ల తగ్గుముఖం పడతాయి. చిరు, నవ ధాన్యాల సాగులో కూరగాయలు, ఆకు కూరలు తదితర పంటలతో తక్కువ కాలంలో రోజూ కొంత ఆదాయం కూడా సమకూరే అవకాశం కలుగుతుంది. ఈ ప్రక్రియ అనంతరం వరి, చెరకు, ఇతర ప్రధానమైన పంటల సాగుకు అనువుగా భూమి తయారవుతుంది. ఆరోగ్యకరమైన పంట దిగుబడి వస్తుంది.

ముచ్చటగా మూడేళ్లు

చిరు, నవధాన్యాల విత్తనాలను వరుసగా మూడేళ్లు సాగు చేస్తే చాలు. ఆ తర్వాత నుంచి వీటిని సాగుచేయాల్సిన అవసరం ఉండదని అధికారులు చెప్తున్నారు. భూమి పూర్తి స్థాయిలో ప్రకృతి సిద్ధంగా సారవంతమై, రసాయనిక ఎరువులతో పనిలేకుండానే.. మెరుగైన దిగుబడి వస్తుందంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రకృతి వ్యవసాయం సాగును ప్రోత్సహిస్తోంది. ఈ నేపథ్యంలో లక్ష్యం మేరకు ప్రకృతి వ్యవసాయం సాగు చేయించడానికి స్వయం సహాయక సంఘాల సభ్య రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులను సమాయత్తం చేస్తున్నారు.



చిరు, నవ ధాన్య విత్తనాల మిక్సింగ్

కిట్‌లో ఉండే విత్తనాలు

ఒక్కో కిట్‌లో రెండు కిలోల పిల్లి పెసర, కిలో వంతున కందులు, పెసలు, మినుములు, జనుం, జీలుగ, వేరు శనగ, అర కిలో చొప్పున ఉలవలు, మొక్కజొన్న, రాగులు, అరికలు, ఆవాలు, పావు కిలో వంతున బొబ్బర్లు, శనగలు, జొన్న, కొర్రలు, సజ్జలు, వంద గ్రాముల ఆముదం, 42 గ్రాముల చిక్కుడు, 22 గ్రాముల గోంగుర గింజలు, పది గ్రాముల రైసిడిరియా, ధనియాలు, 6 గ్రాముల తోటకూర, 5 గ్రాముల పాలకూర, రెండేసి గ్రాముల ఆనప, బీర, కాకర, దోస, ఒక్కో గ్రాము బెండ, గోరుచిక్కుడు విత్తనాలు ఉంటాయి.

రైతుల్లో పెరుగుతున్న ఆసక్తి

మండలంలో 10 గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం జరుగుతోంది. ఇప్పటి వరకు 1075 ఎకరాల్లో 1764 మంది రైతుల ద్వారా ప్రకృతి వ్యవసాయం సాగవుతోంది. ఈ ఏడాది 1800 ఎకరాలకు పెంచాలని ఉన్నతాధికారుల ఆదేశం. ఆ మేరకు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రాథమికంగా భూమిని సారవంతం చేసేందుకు 30 రకాల చిరు ధాన్యాలు, నవ ధాన్యాలు కలిపిన 750 విత్తనాల కిట్లను గ్రామ సంఘాల ద్వారా అందిస్తున్నాం. జి.భీమవరం రైతు భరోసా కేంద్రం ద్వారా పంపిణీ దాదాపు పూర్తి కావచ్చింది. మిగిలిన రైతులకు కూడా త్వరలోనే విత్తనాల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు.

–ద్వారపురెడ్డి రమణ, ప్రకృతి వ్యవసాయం మండల ఇన్‌చార్జి

పార్కులు అభివృద్ధి చేయాలని వినతి

అనకాపల్లిటౌన్ : పార్కుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలంటూ ఎంపీ సత్యవతిని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్‌లు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించారు. స్థానిక శారదానది ఒడ్డునున్న అన్నమయ్య, శాంతిపార్కులు శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. పార్కుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలంటూ ఎంపీకి వినతిపత్రం అందించినట్టు తెలిపారు.



ఎంపీ సత్యవతికి వినతిపత్రం అందిస్తున్న జానకీరామరాజు, రమేష్

'ఉపాధి' ప్రదేశాల్లో అదనపు ఏర్పాట్లు

కశింకోట : వేసవి ఉష్ణోగ్రతల దృష్ట్యా ఉపాధి కూలీలకు పని ప్రదేశాల్లో బిందెలతో తాగునీరు, తాటి ఆకుల పందిళ్లతో నీడ సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకున్నట్లు ఉపాధి పథకం ఏపీవో శివ తెలిపారు. ఆరోగ్యశాఖ సహకారంతో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్స కిట్లను అందుబాటులో ఉంచామన్నారు. ఉదయం 5 నుంచి 10 గంటల వరకు పని వేళలు నిర్ణయించి అవి అమలు కావడానికి చర్యలు చేపట్టామన్నారు. పని కొలతలపై అవగాహన కల్పించి రోజుకి సరాసరి రూ.272 కూలీ పొందడానికి చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు. మండలంలోని అన్ని పంచాయతీల్లో ఉపాధి పనులు జరుగుతున్నట్టు తెలిపారు. చెరువులు, కాలువల్లో పూడికతీత, రక్షణ గట్లను బలపర్చడం, వరద కట్టలు, మట్టి రోడ్లు, డైవర్షన్ డ్రైన్ల నిర్మాణం తదితర పనులు జరుగుతున్నాయన్నారు. సుమారు 5,450 మంది కూలీలు పని చేస్తున్నట్టు తెలిపారు. ప్రతి ఒక్కరికి పని కల్పించడానికి గ్రామాల్లో రాత్రి సమావేశాలు ఏర్పాటు చేసి ప్రోత్సహిస్తున్నామన్నారు. ప్రధానంగా వికలాంగులకు పని కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్టు వెల్లడించారు.

చింతలపాలెంలో పాడి రైతులకు శిక్షణ

కశింకోట : పశువులకు ఏడాదికొక దూడ జన్మించడం వల్ల రైతులకు ఆర్థికంగా లాభం చేకూరుతుందని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి బి.ప్రసాదరావు అన్నారు. మండలంలోని చింతలపాలెం రైతు భరోసా కేంద్రంలో పశు విజ్ఞాన బడి కార్యక్రమంలో భాగంగా బుధవారం పాడి రైతులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. లాభదాయకమైన దూడల పెంపకం పట్ల రైతులు శ్రద్ధ వహించాలన్నారు. ఏలిక పాముల నివారణకు మందులు వేయించాలన్నారు. గ్రామాల్లో పశు వైద్య సేవలందించే 1962 వాహనం, వ్యాధి నిర్ధారణ లేబరేటరీ గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొట్టి రాము, పశు వైద్యాధికారి చైతన్యమణి పాల్గొన్నారు.



పాడిరైతుల శిక్షణలో మాట్లాడుతున్న జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి ప్రసాదరావు

జాబ్ కార్డుదారులందరికీ ఉపాధి

సబ్బవరం: జాబ్ కార్డు ఉన్న వారందరికీ ఉపాధి పని కల్పించాలని డ్వామా పీడీ సందీప్ ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం పీడీ సందీప్ పర్యటించారు. గొల్లలపాలెం, అసకపల్లి, పైడివాడ అగ్రహారం గ్రామాల్లో పని ప్రదేశాల్లో కల్పించిన వసతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయ సిబ్బంది ద్వారా ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. మండలంలో చెరువు గట్లు బలపరచడం, కాలువల అభివృద్ధి, వరద కట్టలు, మట్టి రోడ్లు నిర్మాణం, ట్రెంచ్ పనులు, ఫామ్ పాండ్స్, డైవర్షన్ డ్రెయిన్లు వంటి పనుల్లో 5704 మంది వేతనదారులు పని చేస్తున్నారని చెప్పారు. అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ఉదయం 5 గంటలకు వచ్చి 10 గంటలకు పని పూర్తి చేసుకుని ఇంటికి వెళ్లాలని కూలీలకు సూచించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్స్‌తో పాటు ఫస్ట్ ఎయిడ్ కిట్స్ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. సరాసరి వేతనం రోజుకు రూ. 272 గిట్టుబాటు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

కార్యక్రమంలో అడిషనల్ ప్రోగ్రాం ఆఫీసర్ మళ్ల శ్రీనివాసరావు, ఎంపీడీవో రమేష్‌నాయుడు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ పరమేష్, సిబ్బంది పాల్గొన్నారు.



గొల్లపాలెంలో ఉపాధి కూలీలకు మంచినీరు అందజేస్తున్న పీడీ సందీప్

దత్తక్షేత్రంలో ప్రత్యేక పూజలు నేడు

అనకాపల్లిటౌన్ : గ్రేటర్ విశాఖ విలీన గ్రామమైన సిరసపల్లి చింతామణి దత్తక్షేత్ర ఆవరణలో గురువారం మాసశివరాత్రిని పురస్కరించుకుని గిరీశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు బుధవారం తెలిపారు. ప్రదోషవేళ స్వామివారికి అభిషేకాలు, అర్చనలు జరుగుతాయన్నారు.

ఎండల తీవ్రతతో ఇక్కట్లు

అనకాపల్లిటౌన్ : మూడురోజులుగా పెరిగిన ఉష్ణోగ్రతలు, వడగాడ్పుల కారణంగా పట్టణ వాసులు 11 గంటల నుంచే ఇళ్లకు పరిమితమవుతున్నారు. సాయంత్రం 6 గంటలైనా వేడి తగ్గకపోవడంతో బయటకు రాలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే పెరుగుబజారు కూడలి ఉదయం 10.30 గంటలకే నిర్మానుష్యంగా మారింది. పగటి ఉష్ణోగత 35.8 డిగ్రీలు నమోదు కావడం, దానికి తోడు ఉక్కబోత చిన్నారుల్ని, వృద్ధుల్ని ఉక్కిరిబిక్కిరి చేసింది.

పారిశుధ్య కార్మికుల కృషి ప్రశంసనీయం

అనకాపల్లిటౌన్ : పారిశుధ్య కార్మికుల కృషి ఎనలేనిదని వైఎస్సార్‌సీపీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్ అన్నారు. స్థానిక సర్వకామదాంబ పార్క్ వద్ద బుధవారం ఆయన పారిశుధ్య కార్మికులకు 12 లీటర్ల కొబ్బరి నూనె, 12 బాత్ సోప్‌లు పంపిణీ చేశారు. పారిశుధ్య వాహనం రాకను గమనించి తడి, పొడి చెత్తను వేరు చేసి వారికి అందించాలని స్థానికులను కోరారు. జీవీఎంసీ ప్రజారోగ్య అధికారి ఎస్.ఎస్.రవికుమార్, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు మాడుగుల అప్పారావు, బొండా శంకరరావు పాల్గొన్నారు.

చలి వేంద్రం ఏర్పాటు

పరవాడ: చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచ్ చింతకాయల సుజాతముత్యాలు తెలిపారు. స్థానిక గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యుడు మైలపల్లి అప్పన్న, పంచాయతీ కార్యదర్శి సోమునాయు డు, మాజీ కోఆపరేటివ్ డైరెక్టర్ సూరాడ ముత్యాలరావు, పూజారి ముత్యాలు పాల్గొన్నారు.

నష్టపరిహారం చెక్కు అందజేత



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న సర్పంచ్ సుజాతముత్యాలు

పరవాడ: ముత్యాలమ్మపాలెం శివారు జాలరిపేటకు చెందిన నొల్లి జోగన్న ఇటీవల ప్రమాదవశాత్తు సముద్రంలో పడి మృతి చెందాడు. మృతుడి కుటుంబాన్ని ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.10 లక్షల నష్టపరిహారం ప్రకటించింది. ముందుగా మంజూరు చేసిన రూ.5లక్షల నష్టపరిహారాన్ని చెక్ రూపంలో సర్పంచ్ చింతకాయల సుజాతముత్యాలు బాధిత కుటుంబానికి బుధవారం అందజేశారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు ఎం.అప్పన్న, పంచాయతీ కార్యదర్శి సోము నాయుడు, నాయకులు సూరాడ ముత్యాల రావు తదితరులు పాల్గొన్నారు.

సీసీ డ్రైన్ పనులకు శ్రీకారం

అనకాపల్లి రూరల్ : తుమ్మపాల గుండాలవీధి సాయినగర్ మురుగు కాలువ పనులకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఏళ్ల తరబడి ప్రజలు ఎదుర్కొంటున్న ఈ సమస్య పరిష్కారానికి రూ.7 లక్షల నిధులు విడదలయ్యాయి. దీంతో ఈ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలువ పనులు పూర్తయితే ప్రజల మురుగునీటి కష్టాలు తీరతాయన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమ ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సాయినగర్ ప్రజల కష్టాలు గుర్తించిన రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్, అనకాపల్లి ఎంపీ సత్యవతి చొరవతో నిధులు మంజూరైనట్టు తుమ్మపాల సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు తెలిపారు. అందరికీ మంచి చేసే ఈ ప్రభుత్వానికి ప్రజలంతా మద్దతునివ్వాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విల్లూరి సూర్యకుమారి, విల్లూరి చంద్రశేఖర్, ఎంపీటీసీ పంచదార్ల కన్నారావు, వార్డు సభ్యులు పొలమరశెట్టి కృష్ణ, సత్యనారాయణ, తరసత్యారావు, మూడవ సచివాలయం కన్వీనర్ ఆడారి ప్రసాద్, ఆర్‌టీసీ సత్యనారాయణ, గ్రామీణ నీటి సరఫరా విభాగం జేఈ శ్రీనివాసరావు, స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



డ్రైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న దంతులూరి దిలీప్ కుమార్

రోడ్డు ఆక్రమణలు తొలగించాలని వినతి

అనకాపల్లి రూరల్ : పట్టణంలోని ఉమ్మలాడ రోడ్డులో రహదారిని ఆక్రమించి చేపడుతున్న నిర్మాణాలను అడ్డుకుని, తొలగించాలని ఆ ప్రాంతానికి చెందిన రైతులు బుధవారం జీవీఎంసీ జోనల్ కమిషనర్ పి.వెంకటరమణకు వినతి పత్రం అందించారు. ఉమ్మలాడ జీఎస్‌టీ రోడ్డుకు ఎడమ వైపు మరిడిమాంబ గుడికి వెళ్లే దారిలో రోడ్డును ఆక్రమించి గృహాల నిర్మాణం చేస్తున్నారని పేర్కొన్నారు. దీని వలన వ్యవసాయ భూములకు వెళ్లేందుకు తోవ లేకుండా పోయిందని, వెంటనే ఆక్రమణలను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిబ్రవరి 6న ఇదే విషయంపై స్పందనలో ఫిర్యాదు చేసినా ఇప్పటికీ చర్యలు తీసుకోలేదన్నారు. గతంలో జీవీఎంసీ జోనల్ కార్యాలయం వద్ద ఆందోళన చేసినపుడు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. చర్యలు తీసుకోకపోతే జోనల్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగనున్నట్టు హెచ్చరించారు. కార్యక్రమంలో భీశెట్టి కృష్ణ అప్పారావు, కొణతాల నూక అప్పారావు, కొణతాల చిన్న, పొలమరశెట్టి కుమార్, కాండ్రేగుల సీతారాం, పొలమరశెట్టి ఈశ్వర్రావు, గంగారాము తదితరులు పాల్గొన్నారు.



జీవీఎంసీ జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం అందిస్తున్న రైతులు

పని ప్రదేశాల్లో అప్రమత్తత అవసరం

- ఉపాధి కూలీలతో ఎంపీడీవో ధర్మారావు

అనకాపల్లి రూరల్ : పెరిగిన ఉష్ణోగ్రతల దృష్ట్యా ఉపాధి కూలీలు వడదెబ్బకు గురి కాకుండా జాగ్రత్త వహించాలని ఎంపీడీవో ధర్మారావు సూచించారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి పనులు జరుగుతున్న ప్రాంతాలకు వెళ్లి, ఉపాధి కూలీలతో మాట్లాడారు. వేసవి తీవ్రత, అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో పని ప్రదేశాల్లో నీడ లేకపోతే తాటాకు పందిళ్లు ఏర్పాటు చేసుకోవాలని, అందుబాటులో తాగునీరు ఉండేలా చూసుకోవాలని మేట్లు, కూలీలకు చెప్పారు. మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఎవరికైనా అత్యవసర పరిస్థితి వస్తే వెంటనే స్పందించి వైద్యం అందించాలన్నారు. వేసవి తీవ్రత, అధిక ఉష్ణోగ్రతల కారణంగా మార్పు చేసిన ఉపాధి పని వేళల్ని అందరూ పాటించాలన్నారు. ఉదయం 5 నుంచి 10 లోపు, కూలీ రూ.272 వచ్చేలా పనులు పూర్తి చేసుకోవాలని సూచించారు. మండలంలోని 32 పంచాయతీల్లో పనులు జోరుగా జరుగుతున్నాయన్నారు. ఆయన వెంట ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో ధర్మారావు

'ప్రభుత్వ స్కూళ్లలో పిల్లల్ని చేర్పించండి'

తుమ్మపాల : పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరుతూ సిరసపల్లి ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు బుధవారం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులను కోరారు. జీవీఎంసీ విలీన గ్రామం సిరసపల్లి ఎంపీయూపీ స్కూల్లో పిల్లల్ని చేరిస్తే, వారికి మంచి విద్యా బోధన జరిగేలా పూర్తి బాధ్యత తీసుకుంటానని ప్రధానోపాధ్యాయుడు పి.బాలసుబ్రహ్మణ్యం తల్లిదండ్రులకు భరోసా ఇచ్చారు. ప్రస్తుతం 128 మంది పిల్లలు ఉన్నారని, గ్రామంలో లెక్కల మేరకు పాఠశాల రోల్ 175కు చేరేలా పెరిగేలా కృషి చేస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో జగనన్న విద్యాకానుకతో సకాలంలో పాఠ్యపుస్తకాలు, యూనిఫాం తదితర సామగ్రి, జగనన్న గోరుముద్దతో పోషకాహారం, క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తున్నామన్నారు. ఉదయం 7 నుంచి 11 గంటల వరకు గ్రామంలో ఇంటింటికీ తిరిగి తల్లిదండ్రులతో మాట్లాడుతున్నారు.

కార్యక్రమంలో ఉపాధ్యాయులు కొణతాల రాజేంద్రప్రసాద్, యర్రా చక్రవర్తి, ఎం.కె.వి.ప్రసాద్, సీహెచ్ కోమలత, జి.సూర్యకాంతం, సీహెచ్ రాజేశ్వరి పాల్గొన్నారు.



ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్చాలని కోరుతూ ఇంటింటి ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

మజ్జిగ, చెరకు రసం పంపిణీ

కశింకోట : పశువులకు ఏడాదికొక దూడ జన్మించడం వల్ల రైతులకు ఆర్థికంగా లాభం చేకూరుతుందని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి బి.ప్రసాదరావు అన్నారు. మండలంలోని చింతలపాలెం రైతు భరోసా కేంద్రంలో పశు విజ్ఞాన బడి కార్యక్రమంలో భాగంగా బుధవారం పాడి రైతులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. లాభదాయకమైన దూడల పెంపకం పట్ల రైతులు శ్రద్ధ వహించాలన్నారు. ఏలిక పాముల నివారణకు మందులు వేయించాలన్నారు. గ్రామాల్లో పశు వైద్య సేవలందించే 1962 వాహనం, వ్యాధి నిర్ధారణ లేబరేటరీ గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొట్టి రాము, పశు వైద్యాధికారి చైతన్యమణి పాల్గొన్నారు.



వాసవీ స్వయం సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో మజ్జిగ, చెరకురసం పంపిణీ చేస్తున్న జెడ్పీ వెంకటరమణ

ముమ్మరంగా ఉపాధి పనులు

పరవాడ: జాతీయ ఉపాధి హామీ పథకం పనులు పరవాడ మండలంలో ముమ్మరంగా సాగుతున్నాయని ఎంపీడీవో వి.హేమసుందర్రావు చెప్పారు. మండలంలోని పరవాడ, వెన్నలపాలెం, గొర్లివానిపాలెం చెరువుల్లో చేపట్టిన ఉపాధి పనులను ఆయన బుధవారం పరిశీలించారు. కూలీలతో మాట్లాడి సమస్యలు తెలుసుకొన్నారు. ఉపాధి పనుల్లో భాగంగా చెరువు గట్లను బలపర్చడం, కాలువల అభివృద్ధి, మట్టి రోడ్ల నిర్మాణం, ట్రెంచ్, రింగ్ ట్రెంట్ పనులతో పాటు డైవర్షన్ డ్రైన్‌లు, ల్యాండ్ అభివృద్ధి వంటి పనుల్లో అన్ని వర్గాల నుంచి 2070 మంది కూలీలు పాల్గొన్నారని చెప్పారు. పని జరుగుతున్న ప్రదేశాల్లో కూలీలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ఉదయం 6 నుంచి 10 వరకు మాత్రమే నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



ఉపాధి కూలీల సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీడీవో హేమసుందర్రావు